క్లుప్తంగా

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



ఆత్మీయంగా కలుసుకున్న జ్ఞాననికేతన్ పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: జ్ఞాననికేతన్ హైస్కూల్లో విద్యనభ్యసించిన 1996–97 బ్యాచ్ విద్యార్థులు శనివారం డాబాగార్డెన్స్‌లో గల ఓ హోటల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. 1997వ సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన ఆ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా తమకు విద్యతో పాటు మధుర జ్ఞాపకాలు అందించిన పాఠశాలకు చిరు కానుకగా తమ పాఠశా అభ్యున్నతికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ విద్యార్థులంతా సంతోషంగా గడిపారు.

చిన్నారులకు బహుమతుల పంపిణీ



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న తోట పద్మావతి, చంద్రరావు

అల్లిపురం: సంక్రాంతి సందర్భంగా నీలమాంబ అమ్మవారి ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. 34వ వార్డు యాతపేటలో జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది భోగి రోజున చంద్రరావు పిల్లలను సంతోష పెట్టడానికి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. వార్డు ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, బి.అప్పారావు, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన ఉత్సవ కమిటీ



ఉత్సవ కమిటీ ప్రతినిధులతో ఈవో పద్మావతి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ హరి జవహర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ శనివారం కొలువుదీరింది. కమిటీలో ఆడారి వెంకటమహేష్, బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్, యల్లంకి చిన్నమ్మలు, కణితి గోవిందమ్మ, కర్రి నీలకంఠం, కొల్లి సత్యవతి, ఒమ్మి మోహనరావులకు ఉత్సవ కమిటీకి దేవస్థానం ఈవో కె.పద్మావతి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. అనంతరం వారిని ఈవో కండువాలతో సత్కరించారు. ఉత్సవ కమిటీ ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో పాల్గొంటుందని ఆమె తెలిపారు. ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా, తగిన ఏర్పాట్లను వారు పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.



భోగి పండగ సందర్భంగా పోర్ట్‌హౌస్‌లో నిర్వహించిన సంబరాల్లో సతీసమేతంగా పాల్గొన్న పోర్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావు

కమనీయం.. గోదారంగనాథుల కల్యాణం



విశేష అలంకరణలో గోదా రంగనాథులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా దేవస్థానం కల్యాణ మండపంలో జరిగిన గోదారంగనాథుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదికపై అర్చకస్వాములు ఆసీనులను చేశారు. గోదాదేవి, రంగనాథులు భక్తులకు కల్యాణ దంపతులుగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘవాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణం అర్చకుడు రాఘవాచార్యులు చక్కటి వాఖ్యానంతో ఆద్యంతం కొనసాగింది. తిరుప్పావై పాశురములు, వాటి విశిష్టతను వివరించారు. నెలరోజుల పాటు ఆమె చేసిన పూజలు ఫలించి సాక్షాత్తు రంగనాథుడు గోదాదేవిని కల్యాణం చేసుకున్నారని వివరించారు. ఈ కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో జంటలు పాల్గొని కల్యాణం జరిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.పద్మావతి దేవదాయ శాఖ తరపున గోదారంగనాథులకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు దేవస్థానంలో విందు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాలు తిలకించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అలమేలు మంగ దేవాలయంలో..

స్థానిక అలమేలు మంగ దేవాలయంలో శనివారం సాయంత్రం గోదారంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. ఆలయ అర్చకులు పి.కేశవాచార్యులు కల్యాణ మూర్తులను విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో అలివేలు మంగమ్మకు, పద్మావతి అమ్మవారికి, గోదాదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

పోలీసుల సేవా నిరతి



అనాథలకు చీరలు అందజేస్తున్న సీఐ రేవతమ్మ, వన్‌టౌన్ సిబ్బంది

దాబాగార్డెన్స్: నిత్యం కేసులతో బిజీగా ఉండే పోలీసులు.. సమాజ సేవలో భాగస్వాములయ్యారు. పోలీసులంటే ఒకింత భయపడతారు. కానీ మాలో కూడా మానవత్వం ఉందని వన్‌టౌన్ పోలీసులు నిరూపించుకున్నారు. కనీసం పండగ రోజునైనా అమ్మలకు (అనాథ తల్లులు) సేవ చేయాలన్న సత్సంకల్పంతో భోగి పండగ రోజున వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న తల్లులకు చీరలు అందజేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాసేపు వారితో ముచ్చటించారు. సంస్థకు బియ్యం అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తాము కూడా వివేకానంద భక్తులమేనని, అవకాశం ఉన్నంతలో అనాథల సేవలో పాల్గొంటామని తెలిపారు. వన్‌టౌన్ సీఐ రేవతమ్మ.. ఎస్సైలు తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొని మానవత్వం చాటుకున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం : భోగి సందర్భంగా 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము పేదలకు బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆదేశాల మేరకు కుమ్మరవీధిలో జరిగిన కార్యక్రమంలో 200 మందికి బియ్యం పంపిణీ చేశారు.

ఏయూ సహకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం క్యాలెండర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ కార్యవర్గ సభ్యులతో మాట్లాడారు, సంస్థ స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రణాళిక చేయాలని సూచించారు. వర్సిటీ పరంగా సొసైటీ అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఎ.పల్లవి, రెక్టార్ కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాబా, సంయుక్త కార్యదర్శి సీహెచ్ లక్ష్మణ బాబు, డైరెక్టర్లు డాక్టర్ యుగంధర్, దువ్వి గోవింద్ సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాటి వారికి సాయపడటం మహద్భాగ్యం



చిన్నారులతో కందుల నాగరాజు, వాసవీ క్లబ్ ఎంవీపీ కపుల్స్ సభ్యులు

అల్లిపురం: సాటి వారికి సాయపడటం మహద్భాగ్యమని వాసవీ క్లబ్ వీ–201 ఏ డిస్ట్రిక్ట్ గవర్నర్, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. వాసవీ క్లబ్ ఎంవీపీ కపుల్స్, లీనా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుల నాగరాజు చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండగ రోజున చిన్నారులకు అన్నపానీయాలు అందజేసిన వాసవీ క్లబ్ ఎంవీపీ కపుల్స్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కృష్ణారావు, రీజనల్ చైర్మన్ సాంబమూర్తి, వైస్ గవర్నర్ ఏవీవీ గుప్త, వంకాయల జవహర్, కృష్ణ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అసలు నాస్తి.. కొసరు జాస్తి

- ఆశీలు వసూళ్లలో సెక్రటరీలు
- ముందుకు కదలని సచివాలయాల పనులు



సెక్రటరీలు ఆశీలు వసూలు చేసే పూర్ణామార్కెట్ ప్రాంతం

జగదాంబ: ప్రభుత్వానికి.. ప్రజలకు వారధిగా సచివాలయాల్లో సెక్రటరీల వ్యవస్థ ఏర్పాటు అయింది. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి.. వాటిని ప్రజలకు సక్రమంగా అందేలా చూసే బాధ్యతతో వారు పని చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన ఈ లక్ష్యాన్ని జీవీఎంసీ ఉన్నతాధికారులు నీరుగారుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు.. సెక్రటరీల నియామకంతో ప్రభుత్వ పథకాల గురించి తమకు తెలుస్తోందని.. తమ ఇంటి వద్దకే పథకాలు చేరుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే జీవీఎంసీ జోన్–4 పరిధి 35వ వార్డులో సెక్రటరీల విధులు అగమ్యగోచరంగా మారిపోయాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అందరు కార్యదర్శులు చేస్తున్నట్లు కార్యాలయాల్లో కాకుండా పూర్ణామార్కెట్ వద్ద రాత్రీపగలు తేడా లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తుందని చెబుతున్నారు. వాస్తవంగా పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్ రెండు చోట్లా ప్రతి ఏటా వేలం పాట నిర్వహిస్తారు. ఏ కారణం చేత అయినా పాటదారుడు డబ్బు చెల్లించకపోతే వెంటనే జీవీఎంసీ జోనల్ స్థాయి అధికారులు చర్యలు తీసుకుని సిబ్బందితో పనులు చేయించాల్సి ఉంటుంది. కాని ఇక్కడ సెక్రటరీలు ఎదురుగా కనబడడంతో అన్ని పనులు వారికే చెబుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎండా, వానా, రాత్రీపగలు తేడా లేకుండా వసూళ్ల పేరుతో మార్కెట్ల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజలు ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి సచివాలయలు ఏర్పాటు చేస్తే జీవీఎంసీ అధికారులు సెక్రటరీలను తిప్పిస్తున్నారని అంటున్నారు. దీనివల్ల సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లి.. కార్యదర్శులు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ ఉద్యోగాలు తమను చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సెక్రటరీలు కోరుతున్నారు.

నిర్మానుష్యం..



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న ఆర్టీసీ కాంప్లెక్స్



నిర్మానుష్యంగా కాన్వెంట్ జంక్షన్



నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణా జంక్షన్ ఇలా..

దాబాగార్డెన్స్: సంక్రాంతి పండగ సందర్భంగా విశాఖ మహానగరంలో నివాసముంటున్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాల వాసులు విశాఖ నుంచి స్వస్థలాలకు తరలి వెళ్లడంతో నగరం నిర్మానుష్యంగా మారింది. నిత్యం రద్దీగా కనిపించే ఆర్టీసీ కాంప్లెక్స్ వెలవెలబోయింది. నిన్న మొన్నటి వరకు విపరీతమైన రద్దీ, ప్రయాణికులతో కిటకిటలాడిన కాంప్లెక్స్ ఒక్కసారిగా బోసిపోయినట్టయ్యింది. ప్రయాణికుల కోసం బస్సులు ఎదురు చూస్తున్నాయి. మరికొంత మంది కండక్టర్లు..డ్రైవర్లైతే..శ్రీకాకుళం, రాజమండ్రి, నర్సీపట్నం..అంటూ కేకలు వేస్తూ ప్రయాణికులకు ఆహ్వానం పలుకుతున్నారు. టికెట్ కౌంటర్ కూడా బోసిపోవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ అంతా నిర్మానుష్యంగా మారిపోయింది.

అంతటా ఖాళీ

దక్షిణ నియోజకవర్గం వెలవెలబోయింది. నియోజకవర్గంలో అధిక ప్రాంతాల్లో వలసలు వచ్చిన వారు ఉండడం.. వారంతా సంక్రాంతి పండగకు వారి సొంతూళ్లకు తరలి వెళ్లడంతో చాలా ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. ముఖ్యంగా చిలకపేట, అల్లిపురం, భూపేష్‌నగర్, కల్లుపాకలు, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలతో పాటు మురికివాడ ప్రాంతాల్లో గల వారు స్వగ్రామాలకు వెళ్లడంతో రోడ్లన్నీ వెలవెలబోయాయి. కిటకిటలాడిన వస్త్రదుకాణాలు కొంత మేర రద్దీ తగ్గాయి. సినిమా థియేటర్లు మాత్రం రద్దీగా కనిపించాయి.

బ్రేక్ డ్యాన్స్ నేషనల్ చాంపియన్‌గా చైతన్య



జడ్జి చేతుల మీదుగా ధ్రువపత్రాన్ని అందుకుంటున్న చైతన్య

సీతంపేట: నేషనల్ లెవల్ బ్రేక్ డ్యాన్స్ పోటీలో అక్కయ్యపాలేనికి చెందిన పెంటకోట చైతన్య అద్భుత ప్రతిభతో విన్నర్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన జాతీయ స్థాయి ఒరిజినల్ స్ట్రీట్ డ్యాన్స్ పోటీల్లో అండర్ 16 స్థాయిలో 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం నుంచి పాల్గొన్న చైతన్య మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను సాధించాడు. 2018లో మొదటి సారి పోటీల్లో అడుగుపెట్టిన చైతన్య ఐదేళ్ల కఠోర శిక్షణ తర్వాత నేషనల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. ఎంవీపీలోని డిస్నీ బ్రేకర్స్ ఇంటర్నేషనల్ డ్యాన్స్ స్కూల్‌లో సోహైల్ సింగ్ వద్ద బ్రేకింగ్ డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు.

సందడిగా భోగి సంబరాలు



దిబ్బలపాలెం వద్ద యూత్ సందడి



ప్రేమసమాజంలో భోగి వేడుకలు



హరిదాసుకు బియ్యం వేస్తున్న మహిళలు



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. డూడూ బసవన్నలు..గంగిరెడ్ల కోలాహలంతో భోగిమంటల వెలుగుల్లో పండగ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వెలుగురేఖలు నింపే భోగిమంటల్ని యువత ఆనందోత్సాహాల నడుమ.. వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ తెల్లవారుజామునే వేశారు. రంగవల్లులతో తీర్చిదిద్దారు. నియోజకవర్గ పరిధి పూర్ణామార్కెట్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు వరకు ఉన్న 33 దుకాణాల ముందు ఆయా దుకాణాల యజమానులు భోగి మంటలు వేశారు. వీధులు, గల్లీల్లో భోగి మంటల సందడి కనిపించింది. జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెంలో వరుసగా నాలుగైదు వీధుల్లో పెద్ద ఎత్తున మంటలు వేశారు. ప్రేమసమాజంలో అనాథ పిల్లలు సంక్రాంతి సందడి పురస్కరించుకుని వేసిన భోగి మంటలతో ఎంజాయ్ చేశారు.

వెల్లివిరిసిన ఆనందం

అల్లిపురం: నియోజకవర్గ ప్రజలు భోగి పండగను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నిద్రలేచి నువ్వులు, నలుగు పిండితో అభ్యంగన స్నానం చేశారు. కొత్తబట్టలు కట్టుకుని భోగీశ్వరునికి పూజ చేసి, భోగి మంటలతో చలి కాచుకున్నారు. పిడకల దండలు మంటల్లో వేసి భక్తిశ్రద్ధలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. మేలుకొలుపుల బృందం హరినామ స్మరణతో అల్లిపురంలో తిరువీధి నిర్వహించారు. భోగి మంట చుట్టూ చేరి హరినామ సంకీర్తనలతో అందరినీ ఉత్సాహపరిచారు. హరిదాసుల సందడితో తెల్లవారింది. మహిళలు ఆయన అక్షయ పాత్రలో భిక్ష వేసి నమస్కరించారు. యువత గాలిపటాలతో అలంకరించడంతో వీధులన్నీ రంగులమయంగా కనిపించాయి.

నెహ్రూ యువ కేంద్రంలో భోగిపళ్ల వేడుక

మహారాణిపేట : నెహ్రూ యువ కేంద్రం, శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో శనివారం చిన్నారులకు భోగి సందర్భంగా సామూహిక భోగి పళ్లు పోసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి చిన్నారులకు భోగి పళ్లు పోశారు. మహిళందరూ కలిసి పిల్లలకు హారతులు ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగు వారికి పెద్ద పండగ అన్నారు. ముఖ్యంగా ఇది రైతుల పండగ అని కొత్త ధాన్యంతో ధనలక్ష్మిని ఇంటికి ఆహ్వానిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.చాతుర్య, ఆర్.రాజ్యలక్ష్మి, కామేశ్వరి, జె.లక్ష్మి, టి.గిరిజ, మంగవేణి, నళిని, దేవి, జానకి, రేఖ లలిత, అరుణ, క్షీరాబ్ధి దుతి, సాయి ఆముక్త, జ్యోతిక, చంద్రిక, మహిళలు పాల్గొని సామూహికంగా చిన్నారులకు భోగి పళ్లు పోశారు.

సంక్రాంతి బాజా..



సంక్రాంతి అంటే పెద్దలతో పాటు పిల్లలకు పండగే. డూడూ బసవన్నలు.. గంగిరెడ్ల ఆటలతో.. పీపీలు వాయిస్తూ.. డప్పులు కొట్టడాన్ని చూసిన చిన్నారులు వారిలానే డప్పులు కొడుతూ సంక్రాంతిని ఎంజాయ్ చేశారు.

– డాబాగార్డెన్స్

మరో సైబర్ క్రైం

బాధితుడి ఖాతా నుండి రూ. 1.62 లక్షలు మాయం

అల్లిపురం : అప్పు తీసుకుని పూర్తిగా తీర్చేసినా లోన్‌యాప్ ద్వారా సదరు వ్యక్తిని దోచుకున్న మరో ఘటన విశాఖలో చోటు చేసుకుంది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం పెకిఫర్ లోన్ యాప్ నుంచి డబ్బు తీసుకున్నాడు. కాలపరిమితిలోగా ఆ అప్పును తీర్చేసాడు కూడా. అయినప్పటికీ ఆ కంపెనీ నుంచి ముకేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి డిసెంబర్ ఈఎంఐ బ్యాలెన్స్ వుందని.. డబ్బు కట్టాలని చెప్పాడు. తాను ఇదివరకే ఈఎంఐ చెల్లించానని సదరు వ్యక్తి చెప్పాడు. మీరు చెల్లించింది అప్‌డేట్ కాలేదని, ఫోన్ పేలోకి వెళ్లి యూపీఐ నంబర్‌కి తాము చెప్పిన కోడ్ ఎంటర్ చేయమని లోన్‌యాప్ వ్యక్తి తెలిపాడు. దీంతో బాధితుడు అతను చెప్పిన నంబరు ఎంటర్ చేశాడు. అంతే.. బాధితుడి అకౌంట్ నుంచి రూ.1,62,821 మాయమైపోయాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

అప్రమత్తంగా ఉండండి.. లోన్ యాప్ ఆగడాలు తగ్గినట్లు తగ్గి మళ్ళీ విజృంభిస్తున్నందున ఎవరూ ఆన్‌లైన్ లోన్లు తీసుకోవద్దని సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ తెలిపారు. సైబర్ నేరగాళ్లని నమ్మి మోసపోవద్దన్నారు. అలా ఎవరైనా సైబర్ నేరగాళ్ళ బారిన పడినట్లు అయితే తక్షణమే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930లో గాని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు 9490617917 నంబర్‌లో గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు.

వైభవంగా మకరజ్యోతి పూజలు



విశేష అలంకరణలో అయ్యప్పస్వామి

అల్లిపురం: టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో శనివారం మకరజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. కేరళలో గల శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఈ వేడుక ప్రతి ఏడాది నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా అయ్యప్పస్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు సాయికృష్ణ చేపట్టారు. అయ్యప్ప స్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. హారతి జ్యోతిలో అయ్యప్పను దర్శించుకున్న భక్తుల శరణుఘోషతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు ఎల్‌ఏ సుకుమార్, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పండగ వేళ పువ్వులకు గిరాకీ

ఏయూక్యాంపస్: పండగల నేపథ్యంలో పువ్వులకు గిరాకీ పెరిగింది. పండగ మూడు రోజులు ఆలయాల్లో అలంకరణకు, ఇంట్లో వినియోగానికి, అవసరమైన పుష్పాలను వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. పెదవాల్తేరు రైతు బజార్‌లో శనివారం కూరగాయల దుకాణాలతో పాటు పువ్వుల దుకాణాలు కళకళలాడాయి. వినియోగదారులతో సందడిగా మారాయి. చామంతి హైబ్రిడ్ కేజీ రూ. 280, హైబ్రిడ్ గులాబీ కేజీ రూ.300, బంతి పువ్వుల దండలు రూ. 30 నుంచి రూ. 35, కనకాంబరాలు మూర రూ. 50, విరజాజులు మూర రూ.30 చొప్పున కేజీ రూ.200, కాగడ మల్లి మూడు రూ.40 కి విక్రయించారు. మందారం, తులసి మాలలు, నందివర్ధనం పువ్వులు రైతుబజార్లలో అధిక ధరలకే విక్రయించారు. అయినప్పటికీ వినియోగదారులు పువ్వుల కొనుగోలుకు వెనక్కి తగ్గలేదు. కావలసిన పువ్వులు కొనుగోలు చేసి వెనుదిరిగారు.